క్లుప్తంగా

నేటి నుంచి వీరఘట్టం-పాలకొండ నైట్‌హాల్ట్ బస్సు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ నైట్‌హాల్ట్ బస్సును ఆదివారం నుంచి నడపనున్నట్లు పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రతీరోజు రాత్రి 9.30 గంటలకు పాలకొండ నుంచి బయలుదేరి వీరఘట్టం చేరుకుంటుందని, ఇదే బస్సు మరుసటి రోజు ఉదయం 4.45 గంటలకు వీరఘట్టం నుంచి బయలుదేరి పాలకొండ చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, వీరఘట్టం నుంచి విశాఖపట్నానికి ఫస్ట్ బస్సు నడపాలని స్థానికులు కోరుతున్నారు.

24న సామాజిక సాధికార బస్సుయాత్ర

పాలకొండ: నియోజకవర్గంలో ఈ నెల 24వ తేదీన చేపట్టబోయే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. శనివారం స్థానిక పట్టణంలోని ఏఎంజీ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజుతో కలిసి నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆమె యాత్ర ఏర్పాట్లు, నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ప్రతీ గ్రామం నుంచి పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, సానుభూతిపరులు యాత్రకు వచ్చేలా చూడాలన్నారు. ఇప్పటినుంచే గ్రామాల వారీగా నేతలను సమాయత్తం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఎంఈవో ఆనందరావు

వీరఘట్టం: ప్రతీ పాఠశాలకు సంబంధించి, వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈవో ఆర్.ఆనందరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన వచ్చే విద్యాసంవత్సరానికి కావాల్సిన వసతులు అందుకు అవసరమయ్యే ఖర్చుతో కూడిన వివరాలను తెలియజేయాలన్నారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి, పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

క్రీడాపోటీలు ప్రారంభం



సర్వీసు చేసి, వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ డిప్యూటీ ఈవో లిల్లీరాణి

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల మైదానంలో క్లస్టర్ స్థాయి క్రీడాపోటీలను ఐటీడీఏ డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకబ్ దయానంద్ శనివారం ప్రారంభించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, జావెలిన్ త్రో, ఆర్చరీ, ఖోఖో క్రీడాపోటీలు జరుగుతుండగా, 26 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వారు ఆకాంక్షించారు. ఆటలపోటీల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా తీసుకోవాలని, క్రీడాస్ఫూర్తిని కనబరచాలన్నారు.

ప్రకృతి పంటల సందర్శన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో ఉన్న ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో ప్రకృతి పంటల సందర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పండించిన పంటలను పరిశీలించగా, వారికి పంటల సాగుపై ఆర్.వై.ఎస్.ఎస్. సీనియర్ కన్సల్టెంట్ పారినాయుడు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటలు చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు కూడా వస్తాయని తెలిపారు. తల్లిదండ్రులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

సీతానగరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వాలీబాల్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయ ప్రతినిధి బి.వెంకటరమణ, పాఠశాల పీడీ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓటరుగా నమోదు కావాలి



భామిని: ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్పిస్తూ రెవెన్యూ సిబ్బంది ర్యాలీ

భామిని: అర్హులైన వారంతా ఓటరుగా నమోదు కావాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుహక్కు నమోదుపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 ఏళ్ల వయసు పూర్తయిన విద్యార్థులంతా విధిగా ప్రోస్పెక్టస్ ఎన్‌రోల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇలా దరఖాస్తు చేసుకుంటే 18 ఏళ్ల వయసు రాగానే ఓటుహక్కు వస్తుందన్నారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలకు వెళ్లి, 17 ఏళ్లు నిండిన విద్యార్థుల నుంచి ప్రోస్పెక్టస్ ఎన్‌రోల్‌మెంట్ దరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ఓటుహక్కు నమోదు, ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీలు నిమ్మల శేఖరం, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటుహక్కు నమోదుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జె.రాములమ్మ మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఓటు వజ్రాయుధమని, ఓటుతో దేశభవిష్యత్‌ను నిర్ణయించవచ్చని తెలిపారు. అర్హులంతా ఓటర్లుగా నమోదై, ఉత్తమ పౌరులుగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీవరం పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుహక్కు నమోదుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.వి.సీతారామయ్య ఓటు గొప్పతనం వివరించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, మన ఓటుతో దేశ భవిష్యత్‌ను నిర్దేశించగలమని, అంతటి శక్తివంతమైన ఓటును అర్హులైన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన వారంతా స్వచ్ఛందంగా ఓటుహక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సీతారామయ్య



గుమ్మలక్ష్మీపురం: ఓటు ఆవశ్యకతను వివరిస్తున్న తహసీల్దార్ రాములమ్మ

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక పట్టణంలోని ఎనిమిదో వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు బాగుండాలన్నదే సీఎం జగనన్న ఆకాంక్ష అని, ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు నిర్విరామంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అంతకుముందు పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, కార్యక్రమ నిర్వహణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ వెళ్లి, ఈ నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, వార్డు కౌన్సిలర్లు తూముల కళావతి, కొరికాన గంగునాయుడు, కౌన్సిలర్లు తూముల లక్ష్మణరావు, కొంచాడ అరుణ్‌కుమార్, పల్లా భాను, కిల్లారి మోహన్, బాసూరు కాంతారావు, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ధాన్యం కొనుగోలు



రైస్‌మిలర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పాలకొండ: ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దని జేసీ ఆర్.గోవిందరావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రైస్‌మిల్లర్లతో ఆయన శనివారం సమావేశమయ్యారు. మిల్లుల వారీగా బ్యాంకు గ్యారంటీలపై సమీక్షించారు. ప్రస్తుతం రైతులు వరి కోతలతో పాటు కొన్నిచోట్ల నూర్పులు కూడా చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేయాల్సిన మిల్లర్లు కచ్చితంగా బ్యాంకు గ్యారెంటీలు కలిగి ఉండాలన్నారు. రైతులను ఏ విధమైన ఇబ్బందులకు గురిచేసినా సంబంధిత మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేర ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రాకపోతే ఇతర జిల్లాలకు ధాన్యం తరలించే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సివిల్ సప్లయి డీఎం దేవుళ్ల నాయక్, ఆర్డీవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

21న అప్రెంటీస్ మేళా

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 21వ తేదీన అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. మేధా సర్వో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, జీడిమెట్ల, హైదరాబాద్ వారు ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తుందన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న పురుషులు మాత్రమే అర్హులని, నెలకు రూ.14,215 వేతనంతో పాటు అదనపు అలవెన్సులు ఉంటాయన్నారు. ఫిట్టర్ విభాగానికి సంబంధించి 120, ఎలక్ట్రికల్‌లో మరో 120, మెకానిక్‌లో 50 ఖాళీలున్నాయన్నారు. మేళాకు వచ్చేవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9390063881, 9441930405ను సంప్రదించాలని కోరారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో లావణ్య

పాలకొండ: విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆర్డీవో ఎం.లావణ్య ఆకాంక్షించారు. మండలంలోని చినమంగళాపురం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. తొలుత పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని, అనంతరం ఆ దిశగా పయనం సాగించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

చివరి ధాన్యంగింజ వరకు కొనుగోలు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శెట్టి పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కురుపాం: చివరి ధాన్యంగింజ వరకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేపట్టి, రైతులకు సహకరించాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి, వినిపించారు. అనంతరం కొంతమంది ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారుల పనితీరు ఉండాలని, అధికారుల దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించాలని సూచించారు. వరికోతలు ప్రారంభమయ్యాయని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయ సిబ్బందిని కోరారు. మండలంలో ఎక్కడెక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి, ఎన్ని గోనెసంచులు అవసరమవుతాయన్న విషయాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. చివరి ధాన్యంగింజ వరకు కొనుగోలు జరగాలని, సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వి.వి.శివరామప్ప, తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, జెడ్పీటీసీ జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత




బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో గొటివాడ లక్షుమమ్మకు మంజూరైన రూ.1 లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం అందజేశారు. ఇటీవల ఆమె భర్త గొటివాడ లక్ష్మీనారాయణ కేన్సర్ బారినపడి చనిపోగా, అప్పట్లో వైద్యం ఖర్చుల కోసం బాధితురాలు దరఖాస్తు చేసుకోగా, సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, బాలేరు సర్పంచ్ జామి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత



విద్యార్థిని విద్యాసామర్థ్యం పరిశీలిస్తున్న ఆర్డీవో హేమలత

కొమరాడ: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)ని శనివారం సందర్శించిన ఆమె అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అందిస్తున్న విద్య, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె వివిధ ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు గమనించారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, ప్రతీ పాఠ్యాంశాన్ని ఆసక్తిగా చదివితే విషయాలు చాలా సులభంగా అర్థమవుతాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, పదో తరగతిలో చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు కూడా బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. గతేడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

జయహో భారత్



భారత్.. వరల్డ్ కప్ గెలవాలని ఆకాంక్షిస్తూ వీరఘట్టం మండలం, కిమ్మి గ్రామ పాఠశాల విద్యార్థులు శనివారం ఉదయం ప్రార్థనలో జాతీయ పతాకాలు ప్రదర్శిస్తూ జయహో భారత్ అని నినాదాలు చేశారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ ఇంటర్నేషనల్ స్టేడియంలో క్రికెట్ వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఆస్ట్రేలియాతో ఇండియా ఆదివారం ఆడనుంది. ఈ నేపథ్యంలో మన దేశం కప్ గెలవాలని కోరుతూ విద్యార్థులు దేశభక్తి చాటుకోవడం విశేషం. -వీరఘట్టం

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలి

- ఐటీడీఏ పీవో విష్ణుచరణ్



చెముడుగూడలో అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్



గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామచంద్రరావు

గుమ్మలక్ష్మీపురం: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ అధికారులకు సూచించారు. మండలంలోని చెముడుగూడలో శనివారం పర్యటించిన ఆయన యాత్ర నిర్వహణ తీరు, యాత్రలో ప్రజల భాగస్వామ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చేవారం పి.ఆమిటి, కొండవాడ, లక్కగూడ, చెముడుగూడ తదితర గ్రామాల్లో యాత్ర జరుగుతున్నందున దానికి అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలని, కార్యక్రమంపై ముందస్తు సమాచారం తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. యాత్రలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొనాలని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శనలో ఆయన పాఠశాల రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు చేయాలని, వీటి ద్వారా భూగర్భజలాలు పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ రాములమ్మ, ఎంపీడీవో సాల్మన్‌రాజు ఉన్నారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి, దుమ్మంగి గ్రామ పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గరుగుబిల్లి: వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం/భామిని: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ఇవ్వనున్నట్లు లైబ్రేరియన్లు తెలిపారు.

వీరఘట్టం/జియ్యమ్మవలస/గరుగుబిల్లి: వీరఘట్టం జెడ్పీ బాలికోన్నత పాఠశాల, జియ్యమ్మవలస మండలంలోని బీజేపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, గరుగుబిల్లి మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో గెలుపొందిన వారికి వారోత్సవాల చివరి రోజున బహుమతులు అందజేయనున్నారు.

రైతులను మోసగిస్తే క్రిమినల్ కేసు



వలంటీర్లకు సూచనలిస్తున్న ఏవో శంకరరావు

కొమరాడ: ధాన్యం కొనుగోలులో రైతులను మోసగించే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు అన్నారు. శనివారం మండలంలోని గుణానపురం, విక్రంపురం గ్రామ సచివాలయాల ఆవరణలో ధాన్యం కొనుగోలుపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. దళారుల బారినపడి రైతులు నష్టపోకుండా అవగాహన కల్పించాలన్నారు. రైతులను ఎవరైనా మభ్యపెడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయాలన్నారు.

'హౌసింగ్ డే'



చింతలబెలగాంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పరిశీలనలో అధికారులు, ప్రజాప్రతినిధులు

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ఉమామహేష్, జెడ్పీటీసీ శశికళ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీ శంకరరావు కలిసి, నిర్మాణంలోని జగనన్న కాలనీ ఇళ్లను పరిశీలించారు. అనంతరం వారు లబ్ధిదారులతో మాట్లాడి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలు చేస్తున్న వారీగా దశల వారీగా సకాలంలో బిల్లులు చెల్లింపు జరుగుతుందన్నారు.

ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు అనుమతి



బ్లడ్‌ప్యాకెట్ల స్టోరేజ సామగ్రిని పరిశీలిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు అనుమతి వచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. బ్లడ్‌బ్యాంక్ కోసం ఆస్పత్రి పైనున్న గదుల్లో ఒకటి కేటాయించామని, బ్లడ్‌ప్యాకెట్ల స్టోరేజీకి, రక్త పరీక్షల నిమిత్తం అవసరమైన సామగ్రిని సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలోనే బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా, ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

వీరఘట్టం: స్థానిక అమరావతి కాంప్లెక్స్‌లో అయ్యప్పస్వామి అంబలం పూజ శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి పూజతో ఆరంభమైన పూజ తర్వాత సుబ్రహ్మణ్యస్వామి, దుర్గాదేవి, ఆంజనేయస్వామి అష్టోత్తర శతనామావళితో ముగిశాయి. అనంతరం అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించడంతో పాటు చందనాభిషేకం, విభూదాభిషేకం, తేనాభిషేకం, ఫలరసాలతో అభిషేకం చేశారు.

అవగాహన ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో సికిల్ సెల్ ఎనీమియా(రక్తహీనత) నివారణపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. బుద్ధేశ్వరరావు, సిబ్బంది వ్యాధి లక్షణాలు, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.